# సీనియర్ కమ్యూనిస్టు తాతా నాగేశ్వరరావు సంస్మరణసభ

**కాజ(మొవ్వమండలం), 27-4-16 :**

కా॥ తాతా నాగేశ్వరరావు (80 సం॥లు) 13-4-2016న అనారోగ్యంతో మృతిచెందారు. కా॥నాగేశ్వరరావు కమ్యూనిస్టు కుటుంబ నేపథ్యంలో కృష్ణాజిల్లా మొవ్వ మండలం కాజగ్రామంలో జన్మించారు. నెలరోజులపాటు జరిగిన కాటూరు రాజకీయ తరగతులకు కాజ గ్రామం నుండి విద్యార్థిగా కా॥ నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఆయన కాజ, మందపాలెంలలో రాత్రి పాఠశాలలను నిర్వహించేవారు. రైతు,కూలీ, దళిత వర్గాలను పార్టీలోకి సమీకరించారు. ఈ క్రమంలో అనేక కార్యక్రమాలను, ఆందోళనలను నిర్వహించారు.

1968 సం॥లో సిపియం నయా రివిజనిస్టు రాజకీయాల నుండి విప్లవ కమ్యూనిస్టు రాజకీయాల వైపు కా॥ నాగేశ్వరరావు నిలబడిన క్రమంలో కా॥ చారుమజుందారు నాయకత్వాన అతివాదపంథాను అనుసరించారు. పొద్దువాక భూస్వామి అప్పయ్యశాస్త్రి హత్యకేసులో 7 సం॥లు జైలు శిక్ష అనుభవించారు. ఈ క్రమంలో అతివాదరాజకీయపంథా, దాని కార్యాచరణ పట్ల కా॥నాగేశ్వరరావు సైద్ధాంతికంగా సంఘర్షణపడి కా॥ తరిమెల నాగిరెడ్డి నాయకత్వంలోని విప్లవ రాజకీయాలవైపు దృఢంగా నిలబడ్డారు. కార్యకర్తగా కా॥నాగేశ్వరరావు, ఆయన కుటుంబసభ్యులు పార్టీకి, ఉద్యమానికి అన్నివిధాలా అండగా నిలబడ్డారు.

కా॥తాతా నాగేశ్వరరావు సంస్మరణసభ కృష్ణాజిల్లా మొవ్వ మండలం కాజ గ్రామంలో 27-4-2016న జరిగింది. సభకు రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా సహాయ కార్యదర్శి కా॥జె.జగన్ అధ్యక్షత వహించారు. ముందుగా కా॥ నాగేశ్వరరావుగారి చిత్రపటానికి సిపిఐ(ఎం.ఎల్) జిల్లా నాయకులు కా॥ యద్దనపూడి సోని, జనసాహితి ప్రధానకార్యదర్శి కా॥ దివికుమార్, కా॥నాగేశ్వరరావుగారి భార్య జయలక్ష్మి, కుటుంబసభ్యులు, సిపిఐ, సిపిఎం, ఇతర ప్రజాసంఘాల నాయకులు పూలమాలలతో నివాళలర్పించారు.

సంస్మరణసభలో దివికుమార్ ప్రసంగిస్తూ కామ్రేడ్ నాగేశ్వరరావుతో ఉన్న అనుబంధాన్ని, కార్యకర్తగా ఆ కామ్రేడ్ సాగించిన కృషిలో కొన్ని అనుభవాలను ప్రస్తావించారు. ఆ కామ్రేడ్‌కు ఉన్న ధైర్యసాహసాల్ని జ్ఞాపకం చేసారు. సిపిఐ(ఎం.ఎల్) జిల్లా నాయకులు కా॥ యద్దనపూడి సోని మాట్లాడుతూ 'ఈ దోపిడి వ్యవస్థను కూల్చివేసి సమసమాజంకోసం జరిగే పోరాటాల్లో పాల్గొనటమే, అంతిమ లక్ష్యం కోసం అంకిత భావంతో ఆచరణలో నిమగ్నమవడమే కా॥ నాగేశ్వరరావుగార్కి మనమిచ్చే నివాళి' అని అన్నారు. సిపిఐ, సిపిఎం నాయకులు, గ్రామపెద్దలు, కుటుంబసభ్యులు కా॥నాగేశ్వరరావుగారితో ఉన్న అనుబంధాన్ని, జ్ఞాపకాలను వివరించారు. ఈ సభలో 300 మంది గ్రామస్థులు హాజరయ్యారు.

oooooo